

# మార్పు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

"ఏమేవ్ ఇదిగో .. వెంకట రమణయ్యగారొచ్చారు "

"ఏ వెంకట రమణయ్యగారూ ? .." అంది పార్వతమ్మగారు వంటింట్లోంచి హాలు గుమ్మం ముందుకొచ్చి.

"అదేనే మొన్న వుత్తరం రాశాడూ వాళ్ళమ్మాయిని మన మోహనుడికిస్తామంటూ... తెనాలినించి ... పిల్లకిరవై ఏళ్ళట బి.ఏ. చదివిందిట " శంకర నారాయణగారు కాస్త గొంతు తగ్గించి ఏకరువుపెట్టడం ప్రారంభించారు.

అది గమనించని పార్వతమ్మగారు తన ధోరణిలోనే అంది - "ఆఁ - ఆయనా ? వాళ్ళకీ మనకీ ఏదో దూరపు బంధుత్వముందిట — మా అమ్మ చెప్పింది మొన్న. ఆవిడ అదే ఆయన భార్య — నాకు పెత్తల్లి కూతురి వరస... అంటే ఆ పిల్ల... ఆఁ ! ఉండం ... అబ్బే .. ఆ పిల్ల మనవాడికి వరసకాదండీ "

"చెల్లెలి వరస - మహాపాపం - ఆ మాటే అనుకోకూడదు .."

చెంపలు వేసుకుందావిడ.

శంకర నారాయణగారు మొహం చిట్లించారు. "ఆఁ ! ఎక్కడో ఏదో వరస వుందని అయినా ఆవిడ మీ పెత్తల్లి మొగుడికి రెండో సంబంధం కదా—"

"మీరెన్నయినా చెప్పండి — నాకీ సంబంధం ఇష్టంలేదు ! —"

"ష్ .. చిన్నగా మాట్లాడు-బయట ఆయన కూర్చునివున్నాడు. సరే ఏదో చెప్పి సర్దేస్తానులే ... ఏంచేస్తాం నువ్వు ఒకసారి వచ్చి పలకరిస్తావా . అదీ చెయ్యవా?.... "

"వస్తున్నా ..." అంది పార్వతమ్మగారు.

శంకర నారాయణగారు రిటైరుకాబోతున్నారు. మోహన్ ఆయనకి పెద్ద కొడుకు. ఎం. ఏ. పాసయి ఈమధ్యనే లెక్చెరర్‌గా చేరాడు. బాధ్యతలు ఒక్కొక్కటే వదిలించుకోవాలనే ప్రయత్నంలో వున్నారాయన. ఇద్దరాడపిల్లలకి పెళ్ళిళ్ళయ్యాయి. కొడుకులక్కీ అయిందనిపిస్తే నిశ్చింతగా వుండచ్చని ఆయన తాపత్రయం !

* * *

"ఏరా— వెళ్దామా ?—" పార్వతమ్మ అడిగింది.

"ఎక్కడికమ్మా — ?" కొంచెం విసుగు కలిగినా కప్పిపెట్టుకుంటూ అడిగాడు- మోహన్.

"మళ్ళీ అదే ప్రశ్నా? పొద్దున చెప్పలేదుట్రా ? ఈ ఆదివారమైనా తప్పకుండా రమ్మని వాళ్ళు కబుర్లమీద కబుర్లు పంపుతున్నారు. ముందు చూసొస్తే తరువాత విషయాలు తరువాత !"

బద్ధకంగా లేచాడు.

ఫలానా రామయ్యగారు, వాళ్ళ కూతురు రాధని ఇక్కడికితెచ్చి మోహన్‌కి చూపించాలని నిర్ణయించుకున్నారు. ఇవాళ రాధ వచ్చిందట- కబురుచేశారు.

మోహన్‌కి తల్లి చెప్పిన వివరాలివి.

శంకర నారాయణగారు ఏవో పనులమీద వూరెళ్లారు.

మరో గంటకి, వర్జ్యం లేకుండా చూసుకుని, మంచి శకునం ముందుకి తెప్పించుకుని మరీ బయల్దేరారు పెళ్లి చూపులకి!

*　　　*　　　*

"పిల్లకేంరా కుందనపు బొమ్మల్లేవుంది — వినయం- విధేయతా ముచ్చటగొలుపుతున్నాయి. ముఖ్యంగా వాళ్ల మర్యాద — తీరుతెన్నులూ చూడరా—"

" ... ... ...."

"ఏమిట్రా — ఆ పరధ్యానం?"

"అన్నీ సరేగానీ .. ఆ పిల్ల మరీ గ్రాడ్యుయేటన్నా కాదంటున్నారు గదే .. .... అదే వాడనేది ..." శంకర నారాయణగారన్నారు.

"అదొచ్చిందా మీ తండ్రీ కొడుకులకి నెపం? ఆ పిల్ల యిక్కడికొచ్చి ఉద్యోగాలు చెయ్యాలా-ఊళ్లేలాలా? ఏదో సంసారపక్షం- ఆ మాత్రం చదువు చాలదూ? నేనేం చదివాను...? ఇంత సంసారం నిర్వహిస్తున్నానా- లేదా? అయినా చదువుకున్న పిల్లతో ఎన్ని బాధలో మీకేం తెలుసు? నాకన్నివిధాలా నచ్చిందిది. అయినా కుర్రనాగన్నవి నీకేం తెలుసురా..." అని లోపలికెళ్లిపోయిందావిడ

"ఆలోచించరా మోహనం— మీ అమ్మ చెప్పినదాంట్లోనూ పాయింటు లేకపోలేదు—" అన్నారు శంకర నారాయణగారు.

మోహన్ ఆలోచిస్తూ తన గదిలోకెళ్లాడు. "రాధ-! చక్కగావుంది. నిజమే. విశాలమైన కళ్లూ - బంగారు పోతవంటి విగ్రహం- అమ్మకి బాగా నచ్చిందంటే అతిశయోక్తిలేదు అంతటి వినయవిధేయతలున్నాయి. కానీ, తనకి ఎప్పట్నించో కనీసం బి. ఏ. పాసయిన అమ్మాయి అయితే బాగుండునని కోరిక. ఈ అమ్మాయిని చేసుకుంటే- అమ్మతో పురాణాలకీ- హరికథలకీ వెళ్ళడానికి పనికొస్తుంది. కానీ తనతో ఫ్రెండ్స్ ఇళ్లకి — పార్టీలకీ తీసికెళ్తే అప్పే తనకే డామ్ ఇన్‌సల్ట్! పోనీ నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్పితే .. ? అమ్మమాట కాదనడం ఎందుకు? —"

ఈవిధంగా సాగుతూనే వున్నాయి మోహన్ ఆలోచనలు. ఒక వారం గడిచింది.

మళ్లీ తల్లి ఈ విషయమేమీ ఎత్తలేదు.

తనకిష్టంలేదని వూరుకుందేమో ననుకున్నాడు - మోహన్.

"అమ్మా—"

"ఏమిట్రా? —" వచ్చింది పార్వతమ్మ.

"మొన్నటి ఆసంబంధం...నీ ఇష్టప్రకారవే కానియ్యమ్మా—"

"ఏ సంబంధంరా? —"

"అదే ఆ రాధ ."

"అదా...ఎనకొద్దని కబురుచేసేశాను—" తాపీగా అందావిడ.

అర్థంకాలేదు మోహన్‌కి.

"ఏం జరిగిందమ్మా?—"

"వాళ్ల కుటుంబం మంచిదికాదురా .... వాళ్ల మేనత్త ఎవడితోనో .... ఛీ ఛీ ఆ మాటలనడానికే నాకు నోరు రావడంలేదు... వక్రబుద్ధులు . ఈ సంగతి ముందే తెలుస్తే అసలు చూడ్డానికే పోకపోదుం— తలుచుకుంటేనే అసహ్యం వేస్తుంది. ఇంక ఆ సంబంధం గురించి మాట్లాడద్దు—" గబగబా వెళ్లిపోయింది పార్వతమ్మగారు.

వాళ్ల మేనత్తేదోచేస్తే ఈ అమ్మాయి తప్పేమిటో అర్థంకాలేదు మోహన్‌కి.

ఆలోచిస్తూ నిలబడిపోయాడు.

*　　　*　　　*

"నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చిందమ్మా...."

తండ్రితో మాట్లాడి - లోపలికివచ్చి వంటింటి గడపల్లో కూచుంటూ అన్నాడు మోహన్.

"ఎవరికీ- నీకేనా? ఏవూరురా? అయినా అప్పుడే ట్రాన్స్‌ఫరేమిట్రా?—"

"ఏం చేస్తామమ్మా మనచేతిలో ఏముంది-"

"మార్చుకోవచ్చుట కదురా .. మొన్న ఆవిడ చెప్పింది—" ఎవరు చెప్పారోనని జ్ఞాపకం తెచ్చుకుంటూ అందావిడ.

"ఎందుకమ్మా- ఇప్పుడు మార్చుకోవడం- ఏమవసరం వచ్చిందని· ఆవిధంగానైనా కొత్త వూళ్లుచూడచ్చు-" విసుగ్గా అన్నాడు మోహన్.

పీటవేసి మంచినీళ్లు పెట్టింది పార్వతమ్మ. కూచున్నాడు.

ప్లేటులో వేడివేడి ఇడ్లీలు - పచ్చడి - కారప్పొడి వేసింది. నెయ్యి వేసింది. పక్కన కాఫీ గ్లాసు పెట్టింది.

కొడుకు చికాకు తగ్గాక మళ్లీ అడిగింది.

"ఏ వూరురా - ఎప్పుడెళ్లాలి? —"

"హైదరాబాదు బహూశా వచ్చేనెల్లో వెళ్లాల్సి వుంటుంది—" అన్నాడు మోహన్.

అక్కడ మోహన్ క్షేమసమాచారాలు కనుక్కునేందుకు బంధువులుగాని - తెలిసిన వాళ్లుగానీ వున్నారా - అనే ఆలోచనలలో పడిపోయిందావిడ!

*　　　*　　　*

మోహన్‌వెళ్లి ఆరు నెలలపైనయింది.

మోహనక్కడ దూరపు బంధువులింట్లో వుంటున్నాడు ప్రస్తుతం.

ఆరోజు పోస్టులో కొడుకు ఉత్తరంతో బాటు-ఇంకొక ఉత్తరం కూడా వచ్చింది. అది మోహన్ వుంటున్న ఆ ఇంటాయన రాశాడు.


ఆ ఉత్తరం చదివి ఆలోచనలో పడిపోయారు శంకరనారాయణగారు.

భార్య పలకరించినా పరధ్యానంగానే జవాబు చెప్పారు.

ఆవిడకేదో భయంవేసింది. అనుమానం వచ్చింది. "ఏమిటండీ - ఎందుకట్లా వున్నారు? ఏమైంది? ఎక్కడ్నించా ఉత్తరం? మోహనుడు రాశాడా? ఎట్లా వున్నాడు వాడు-వాడికేం కాలేదు గదా?"-ఆత్రుతగా ప్రశ్నలవర్షం కురిపించింది.

"ఏం లేదే - నన్ను విసిగించకు-" అన్నారాయన మళ్ళీ ఉత్తరం విప్పిచదువుతూ.

"ఏమిటి ఏం లేదూ? నా దగ్గెరెందుకు మీకు దాపరికం? ఏదోవుంది - నాకు చెప్ప



# మార్పు

కూడదనిదా ?—"

ఆవిడింకా ఆదుర్దాగా నిష్ఠూరాలు కూడా మొదలుపెట్టింది.

"అబ్బే— చెప్పకూడనిదేం కాదే... "

ఇంక లాభం లేదనుకుని పెద్దగా చదివారా ఉత్తరాన్నాయన.

అందులో మోహన్ ఈమధ్య విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడనీ - ఎవరో హరిజన పిల్లతో పరిచయం పెంచుకున్నాడనీ - ఆ అమ్మాయిని రెండుమూడుసార్లు వాళ్ళింటికికుడా తీసుకొచ్చాడనీ- ఆ పరిచయం ఇంకదేనికీ దారితియ్యక మునుపే జాగ్రత్త తీసుకోవడం మంచిదని - పెద్దవాడిగా - 'మీకు రాస్తున్నాను... మరోలా భావించవద్దంటూ' రాశాడాయన.

కాళ్లూ చేతులూ ఆడలేదు - పార్వతమ్మగారికి. వెంటనే తొందర చేసింది - భర్తని బయల్దేరమని - తనూ ప్రయాణమయింది.

ఆవిడ ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

"నువ్వొద్దులేవే. నేను వెళ్లి చక్కబెట్టుకొస్తాగా ? - నీకెందుకు ?_"

"ఏమోనండీ - ఈపాటికే .."

"ఆఁ- అంత ధైర్యం మనవాడికి లేదులే..."

ఎన్నోవిధాల భార్యకి సర్ది చెప్పి - ధైర్యం చెప్పి — బయల్దేరారు శంకర నారాయణగారొక్కరే - హైద్రాబాద్‌కి.

ఆయన వెళ్లాక - పార్వతమ్మగారికి నిదర్లేదు — ఎట్లాగయినా తొందర్లో మోహన్‌కి పెళ్లిచేసెయ్యాలని తీర్మానించుకుంది.

ఆవిడ ఆలోచనలలొ రామయ్యగారి రాధ సంబంధమే అయినా కూడా నయమే-ఈ హరిజనుల పిల్లకంటే అనిపించింది.

*          *          *

బంధువుల ఇల్లు కనుక్కోవడం కాస్త కష్టమే అయింది శంకర నారాయణగారికి.

వెళ్లంగానే చాలా మర్యాద చేశారు-వాళ్లు.

స్నానం భోజనమయ్యాక- మొదలుపెట్టాడు ఇంటాయన వెంకట్రామయ్యగారు.

'బావగారూ- పిల్లవాడు చాకులాంటివాడు. ఎట్లా పరిచయమైందో ఆ పిల్ల . ఇంకా వ్యవహారం అంతగా ముదిరినట్లులేదుగానీ..."

వింటున్నారు శంకరనారాయణగారు.

"నేను చెప్పేదేమిటంటే. . ... వెంటనే సంబంధంచూసి - పెళ్లిచేసేస్తే అన్నీ అవే సర్దుకుంటాయి-అదీగాక - ఆ వయసు పిల్లలని మనం మందలించలేము కదండీ - సూటిగానూ చెప్పలేము—"

".... .... . "

"మీరు నేనిది అవకాశంగా తీసుకుంటున్నానని అనుకోబోతే ... మా అమ్మాయి ప్రమీలే వుంది మీరు - అక్కగారు కూడా చూసి సరేనంటే... మా కంతకంటే ఆనందం మరొకటి ఉండదు "

"అమ్మాయిప్పుడు వాళ్ల తాతగారి దగ్గిరకెళ్లింది. చదువంతగా రాలేదు దానికి. కానీ. . ఇంటి పనలన్నీ చేస్తుంది. మోహన్‌కి బాగా చనువే— ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ వుంటారు కూడా—"

" . . ."

"అందుకని- బావగారూ మీరు ఆలోచించుకోండి మాకూ ఒక్కత్తే కూతురు.... అంతా అమ్మాయిదే . "

శంకరనారాయణగారికి ఏవీ వినబడ్డంలేదు. ఎంతసేపు ఎదురుచూసినా మోహన్ జాడలేదు.

"బావగారూ... ఆ అమ్మాయి ఇల్లెక్కడో మీకు తెలుసా ?.... ఒకసారి వెళ్లొస్తాను—"

"వాళ్లింటికా - మీరెందుకండీ?—"

"ఫరవాలేదు- ఒకసారి వూరికే వెళ్లొస్తాను- మీకు అడ్రసు తెలిస్తే చెప్పండి —"

"అడ్రసు తెలీదుకానీ .. ఆ అమ్మాయి తండ్రి పేరూ - వాళ్ళుండే వీధి పేరూ చెప్పాడెప్పుడో మోహనే...." అంటూనే చెప్పాడాయన.

కాగితంమీద రాసుకుని బయల్దేరారు- శంకర నారాయణగారు.

*          *          *

కాగితం ఒక సారీ - ఇంటివైపు మరోసారీ చూసుకుని - గేటు తెరిచి లోపల అడుగు పెట్టారు శంకరనారాయణగారు.

అందంగావుంది తోట. పూలచెట్లు పూల కుండ్లు-పచ్చని పచ్చిక...కళ కళ లాడుతోంది - ఇల్లు - తోటలో !

పి. ఆనందరావు. ఎక్కడో విన్నట్టుంది పేరు ! కాలింగ్‌బెల్ నొక్కి నుంచున్నారు !

తలుపు తెరుచుకుంది.

నిశ్చేష్టులయ్యారు !

ఎదురుగా నవ్వుతూ- పచ్చని పట్టుచీరతో- నుదుట రూపాయంత బొట్టుతో ...ఎవరు ?

సుభద్ర ! సుభద్రే ! సందేహంలేదు.

"ఎవరో అనుకుంటున్నాను - ఎన్నాళ్లకి... ఎన్నాళ్లకి నిన్ను చూశాను.... రా అన్నయ్యా... లోపలికిరా..."మాటలకి తడుముకుంటూలోపలికి ఆహ్వానించింది సుభద్రమ్మ- ఆనందంతో !

యాంత్రికంగా నడిచివెళ్లి ఆమె చూపిన కుషన్ సోఫాలో కూచున్నారు.

సుభద్ర తండ్రి- తన తండ్రి స్వంత అన్నదమ్ములే- ఆ రోజుల్లోనే సుభద్రని బాగా చదివించాడు - సుభద్ర తండ్రి. సుభద్ర తన క్లాస్‌మేట్ ఆనందరావుని వర్ణాంతర వివాహం చేసుకుంది. ఆ రోజుల్లో అదొక సంచలనమే ! వాళ్ల కుటుంబాన్నే వెలివేసినట్లు చూసేవారు ! అందుకనే రాకపోకలు అసలే లేకుండా పోయాయి తమకీ, వాళ్లకీను !

అయితే మోహన్‌తో కలిసి తిరుగుతున్న ఆ పిల్ల...?

అవును సుభద్ర కూతురే !

సుభద్ర కూతురు హరిజనుల పిల్ల ఎట్లా అవుతుంది ? అయితే మాత్రమేం ?

"సుభద్రా... మీ అమ్మాయి...?"

"అవునన్నయ్యా.... నాకు సుమంత ఒక్కత్తే కూతురు—"

"మీ అమ్మాయి స్నేహితుడు మోహన్ నా కొడుకని నీకు తెలుసా?..."

"ఏమిటి... నిజమా ? ఎంత మంచి వార్త అన్నయ్యా...? వాళ్లిద్దరూ పెళ్లిచేసుకుందామని నిర్ణయించుకున్నారట-ఇవాళే నాతో చెప్పారు... నువ్వేనని తెలీక- అంటే మోహన్ తండ్రితో మాట్లాడాలని — మీ ఊరు వద్దామనుకుంటున్నాను.. మనిద్దరం ఇట్లా కలవడం — నిజంగా... దైవేచ్ఛ..."

ఏమీ మాట్లాడలేదు శంకరనారాయణగారు కాలం మారుతోంది- మనమూ మారాలి !

"అన్నయ్యా... కులం పట్టింపు గురించా ఆలోచిస్తున్నావు ?..."

"లేదు సుభద్రా- నీ యిష్టమే-నా యిష్టం-"

"ఆ రోజు ధైర్యంగా వర్ణాంతర వివాహం చేసుకున్నావు- అందర్నీ ఎదిర్చి నిల్చావు- సంతోషంగా వున్నావు-నువ్వే వాళ్ళకికూడామార్గదర్శకురాలివి...... కావాలి ! వాళ్ళకేకాదు మరెందరికో..."

మనస్ఫూర్తిగా అన్నారు శంకర నారాయణగారు. ఇప్పుడాయన మనసులో ఏ సందేహాలూ లేవు. పార్వతమ్మకి నచ్చచెప్ప గలననే ధైర్యమూ కలిగింది - ఆయనకి !!